ఇవ్వాలి. ఈ పూట పనవ్వగానే ఇంటికి వెళ్లి సాయంత్రం త్వరగా రావాలి'' తులసి వైపు చూస్తూ అన్నది సునీత.

తులసికి పనెక్కువ చెప్పినప్పుడు కోపం రావడం, చిరాకు పడటం సునీత ఎప్పుడూ చూడలేదు. ఆమె ముఖం ఎప్పటిలాగానే ప్రశాంతంగా కనిపించింది. అది చూడగానే సునీతకి మళ్లీ ప్రశ్నార్థకం గుర్తు కళ్ల ముందు మెదిలింది. 'ఒక్కదాని రెక్కల కష్టం మీద మూడు ప్రాణాలు బతకాలి. సరైన తిండి, కట్టుకోవడానికి సరైన గుడ్డ లేదు. మరేం చూసుకుని ఈ ప్రశాంతత?' ఒక క్షణం మనసులో అనుకుంది సునీత.

''అమ్మగారు! చిన్నబాబు గారిని బాగా చదివించారు. బాబు తప్పకుండా అందరికంటే ఫస్టుగా పాసవుతాడు. మీరు చెప్పినట్లు సాయంత్రం తొందరగా వస్తానమ్మా!'' ముఖం చేటంత చేసుకుని అన్నది తులసి.

'మరి కొద్ది క్షణాలలో మన విద్యాశాఖ మంత్రిగారు పదో తరగతి ఫలితాలు విడుదల చేస్తారు!' అని టీవీలో వార్త వినిపించింది.

''ఇక నన్ను విసిగించకుండా ఇక్కడినుంచి వెళ్లి పని చూసుకో!'' అని సిస్టం ముందు నుంచి లేచి, హాల్‌లోకి వచ్చి టీవీవైపు చూసింది సునీత.

రోహిత్ సోఫాలో కూర్చుని టీవీ చూస్తున్నాడు. అతని ముఖమంతా చెమటలు పట్టాయి. టెన్షన్‌గా సునీత వైపు, టీవీవైపు మార్చి మార్చి చూస్తున్నాడు.

''రోహిత్! మరి కాసేపట్లో నీ రిజల్ట్స్ వస్తున్నాయి. నేను సిస్టంలో చూస్తాను. నువ్వు కూడా నాతో రా!'' అంటూ వేగంగా గదిలోకి వెళ్లింది సునీత.

తులసి కాసేపు ఏదో అడగాలని తచ్చాడుతూ సునీత పట్టించుకోవడం లేదని గ్రహించి అక్కడినుంచి లోపలికి వెళ్లిపోయింది. విద్యాశాఖ మంత్రి ఫలితాలు వెల్లడి చేశారు. సిస్టంలో సర్వర్లన్నీ బిజీ అయ్యాయి. సునీత ముఖంలో విపరీతమైన కంగారు మొదలైంది. అది చూస్తున్న రోహిత్ మనసులో అంతకంతకూ భయం పెరుగుతున్నది.

''అమ్మా! ఒకవేళ నువ్వనుకున్నట్లు నేను స్కూలు ఫస్ట్ రాకపోతే?'' భయపడుతూనే అడిగాడు రోహిత్.

''నో వే.. నీకు తప్పకుండా వస్తుంది. అలాంటి మాటలు మాట్లాడి నన్ను ఇంకా టెన్షన్ పెట్టకు'' అసహనంగా మౌస్ కదుపుతూ అన్నది సునీత.

ఆ మాటలకు రోహిత్ మనసులో భయం మరింత పెరుగుతున్నది. ఒళ్లంతా వణుకు వస్తున్నది. సరిగ్గా అప్పుడే అతని భుజం మీద ఒక చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూసేసరికి మాధవ్ ఉన్నాడు.

''బీ బ్రేవ్ మై బాయ్!'' చిన్నగా అన్నాడు మాధవ్.

రోహిత్ మాట్లాడకుండా తండ్రి చేయి తన రెండు చేతులతో పట్టుకున్నాడు.

''రోహిత్! నీకు టెన్ బై టెన్ పాయింట్స్ వచ్చాయి. నా అంచనా ప్రకారం కాసేపట్లో మీ స్కూల్ నుంచి ఫోన్ వస్తుంది'' ఆనందంగా అరుస్తూ రోహిత్ చెయ్యి పట్టుకుని ఊపేస్తూ అన్నది సునీత.

రోహిత్ ముఖం పువ్వులా వికసించింది. కానీ, అంతలోనే మళ్లీ భయంతో ముడుచుకుపోయింది. అది చూసిన మాధవ్‌కి పరిస్థితి అర్థమైంది.

''రోహిత్! నువ్వు మంచి మార్కులతో పాసయినందుకు చాలా ఆనందంగా ఉంది. కంగ్రాట్స్'' అంటూ అతని నుదురు మీద ముద్దు పెట్టుకున్నాడు మాధవ్.

''రోహిత్ స్కూల్ ఫస్ట్ వచ్చాడని స్కూల్ నుంచి ఫోన్ రాలేదు. కొంపదీసి వీడికి ఫస్ట్ ర్యాంక్ రాలేదంటారా? స్కూల్‌కి ఫోన్ చేసి చూడనా?'' అన్నది సునీత.

''సునీ! ర్యాంకులు పిల్లల శక్తి సామర్థ్యాలను నిర్ణయించలేవు. నీలాంటి తల్లితండ్రుల వల్లే పిల్లల్లో అసూయ ద్వేషాలు పెరుగుతున్నాయి. ర్యాంక్ రాకపోతే తల్లిదండ్రుల కోపాలకు, నిరాశలకు పిల్లలు బలవుతున్నారు. తోటి పిల్లల గెలుపును మంచి మనసుతో అభినందించలేక పోతున్నారు. రోహిత్‌కి ఫస్ట్‌ర్యాంక్ రాకపోయినంత మాత్రాన ఇప్పుడు వచ్చిన నష్టమేముంది?'' అన్నాడు మాధవ్.

అంతలో సునీత ఫోన్ రింగయింది.

''స్కూల్ నుంచి ఫోన్!'' ఉద్వేగభరితంగా అంటూ ఫోన్ తీసింది సునీత. రోహిత్ తండ్రి చెయ్యి పట్టుకుని తల్లివైపు బిక్కమొహంతో చూశాడు. మాధవ్ మాట్లాడకుండా దగ్గరికి తీసుకున్నాడు.

''ఓ మై గాడ్! థాంక్యూ.. థాంక్యూ! థాంక్యూ సో మచ్ అండి. ఇన్నాళ్లకు నా కలలు నెరవేరాయి. మీ స్కూల్‌లో టీచర్స్ అందరికీ నేను రుణపడి ఉంటాను. నేను రోహిత్‌ని తీసుకొని మిమ్మల్ని కలుస్తాను. వన్స్ అగైన్ థాంక్స్ అండి!'' అంటూ ఫోన్ పెట్టేసింది సునీత.

అప్పటికే విషయం అర్థమైన రోహిత్, మాధవ్ ఇద్దరూ ఊపిరి పీల్చుకున్నారు.

''హార్టీ కంగ్రాట్స్ మై బాయ్!'' పెద్దగా అరుస్తూ రోహిత్‌ని కౌగలించుకుంది సునీత.

''థాంక్స్ అమ్మా!'' నవ్వుతూ అన్నాడు రోహిత్.

ఈ అరుపులకు తులసి కూడా హాల్‌లోకి వచ్చి వాళ్లను చూసి తనుకూడా వారి నవ్వుల్లో జత కలిపింది.

''తులసీ! చెప్పానా! మా రోహిత్ స్కూల్ ఫస్ట్ వస్తాడని. అలాగే వచ్చాడు!'' పట్టలేనంత ఆనందం సునీత గొంతులో.

''కూర్చోబెట్టి చదివిస్తే చదువు రాదన్నారు. ఇప్పుడైనా మీకు తెలిసిందా? మంచి స్కూల్‌లో చేర్పించి, క్రమపద్ధతిలో చదివిస్తేనే చదువు వస్తుంది'' మాధవ్ వైపు తిరిగి అరుస్తూ అన్నది సునీత.

''సునీ! నువ్వు చాలా ఎగ్జయిట్ అవుతున్నావు. నీ కోరిక నెరవేరింది కదా! ముందు కాస్త రిలాక్స్ గా కూర్చో!'' అంటూ ఆమె చేయి పట్టుకుని సోఫాలో కూర్చోబెట్టబోయాడు మాధవ్.

అంతలో కాంపౌండ్ వాల్ దగ్గర గేటు తీసిన శబ్దమయింది. అందరి దృష్టి అటు వైపు మళ్లింది. గేటు తీసుకుని కొంతమంది విలేకర్లు లోపలికి వస్తున్నారు.

''అదుగో! అప్పుడే మీడియా వాళ్లకు స్కూల్ నుంచి సమాచారం అందినట్లుంది. ఇప్పుడు రోహిత్ దగ్గర ఇంటర్వ్యూ తీసుకుంటారు. తల్లిదండ్రుల ఫీలింగ్స్ కూడా అడుగుతారు. మీరు పిచ్చి మాటలు మాట్లాడకుండా కాస్త జాగ్రత్తగా మాట్లాడండి. అది లోకల్ టీవీలో కూడా ప్రసారమవుతుంది. అర్థమవుతుందా?'' కంగారు కంగారుగా అంటూ రోహిత్ చెయ్యి పట్టుకుని వాళ్లకు ఎదురు వెళ్లింది సునీత.

విలేకర్లు ఆమెను దాటుకుంటూ ముందుకు వెళ్లారు.

''హలో! ఇటు చూడండి.. రోహిత్ ఇక్కడే ఉన్నాడు!'' అని పిలిచింది సునీత.

వాళ్లు వినిపించుకోకుండా వెళ్లి తులసి దగ్గర ఆగారు. వాళ్లు తన దగ్గరికి వచ్చి మైక్ ముందు పెట్టగానే.. తులసికి ఏమీ అర్థంకాక అయోమయంగా బిత్తర చూపులు చూస్తున్నది.

''అమ్మా! మీరు వేణు తల్లి తులసి గారేనా?'' అన్నాడు ఒక విలేకరి.

''అవును బాబూ! వేణు నా కొడుకే.. ఏమైందయ్యా!?'' అయోమయంగా అన్నది తులసి.

''మీ అబ్బాయి వేణు పదో తరగతిలో మన స్టేట్‌ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు గారు అతి నిరుపేద కుటుంబానికి చెందిన వేణుకి చిన్నప్పటి నుంచీ చదువంటే చాలా ఇష్టమని గొప్పగా చెప్పారు. మీరేమంటారు?'' అన్నాడు మరో విలేకరి.

''వేణు విజయానికి మీరే విధంగా సహాయం చేశారు?'' అన్నాడు ఇంకో విలేకరి.

తులసికి వాళ్ల మాటల్లో వేణు పాసయ్యాడని మాత్రం అర్థమైంది. అందుకు వీరంతా ఎందుకు వచ్చారో అర్థం కావడం లేదు.

''వేణూ! మీ అమ్మగారు అకస్మాత్తుగా నీ గెలుపు వార్త వినడం వల్ల ఆనందంతో మాట్లాడలేకపోతున్నారు. అక్కడే ఆగిపోయావేంటి? ఇలా రా!'' అని విలేకర్లలో ఒకతను వెనక్కి తిరిగి పిలిచాడు.

అప్పుడు అందరి దృష్టి గుమ్మం వైపు మళ్లింది. అక్కడ వేణు నిలబడి ఉన్నాడు. వెనుక నుంచి టీవీలో వార్తలు వినిపిస్తున్నాయి.

'మచిలీపట్నానికి చెందిన వేణు స్టేట్ ఫస్ట్ వచ్చాడు. ఈ అబ్బాయి గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్య రాణిస్తుందనడానికి ఇదో మచ్చుతునక'...

హాల్ టికెట్ మీదున్న వేణు ఫొటో టీవీలో చూపిస్తున్నారు.

''డాడీ! వేణు!.. వేణుకి స్టేట్ ఫస్ట్ వచ్చింది!'' సంతోషంగా అన్నాడు రోహిత్.

''రియల్లీ గ్రేట్ రోహిత్! వేణుకి అభినందనలు తెలియజేద్దాం పద..'' అన్నాడు మాధవ్.

(మిగతా భాగం.. 28వ పేజీలో)

## కైకాల వెంకట సుమలత



పిల్లల తెలివితేటలను ర్యాంకులతో నిర్ధారించి.. వారి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న వ్యవస్థ మారాలని 'ఆశ బరువు తూయగలమా!' కథ ద్వారా కోరుతున్నారు రచయిత్రి కైకాల వెంకట సుమలత. వీరి స్వస్థలం కృష్ణా జిల్లా గుడివాడ. డిగ్రీ తర్వాత టీటీసీ చేశారు. ఊహ తెలిసినప్పటి నుంచే తన మనసును ఆకట్టుకునే అందాలకు, హృదయాన్ని కదిలించే ఆర్ద్రతకు అక్షర రూపం ఇవ్వాలని ఉవ్విళ్లూరేవారు. డిగ్రీ మొదటి సంవత్సరం సావనీర్‌లో వీరి మొదటి కవిత 'అందాల శిశిరమా! నిశ్శబ్దత దాల్చి దుఃఖిస్తావెందుకు?' ప్రచురితమైంది. మొదటి కథ 'ప్రేమించే మనసు'.. ఆంధ్రభూమి సచిత్ర వారపత్రికలో వచ్చింది. అలా వీరి సాహితీప్రయాణం మొదలైంది. సాహో, స్వాతి ముత్యం, ఏది దానం?.. ఎవరు దాత? కథలు విశేష పాఠకాదరణ పొందాయి. శ్రీమతి సుశీల నారాయణ రెడ్డి ట్రస్టు నుంచి వీరి కథల సంపుటి 'సుమ సౌరభాలు' వెలువడింది. వీరి రచనలు అన్ని ప్రముఖ దిన, వార పత్రికలలో ప్రచురితం అయ్యాయి. వాటిలో బహుమతులు పొందినవే ఎక్కువగా ఉన్నాయి. సాహిత్య ప్రయాణంలో భాగంగా.. సోమేపల్లి జాతీయస్థాయి పురస్కారం, అక్షరాల తోవ జాతీయ స్థాయి పురస్కారం, మం'దారం' లాంటి పలు జాతీయస్థాయి పురస్కారాలు అందుకున్నారు.